

# ఒక్క పది నిమిషాలు

ఉషశ్రీ *

"జూదం వేరూ, చెలగాటం వేరూ" అని, భార్యవైపు మెల్లగా చూపులు నడిపి.

"జీవితంతో కొందరు జూదమాడితే, జీవితమే కొందరిని జూదమాడిస్తుంది. అలానే కొందరు దానితో చెలగాటమాడితే, అది కొందరితో చెలగాటా లాడుతుంది."

సిగరెట్ పొగ సన్నగా వదులుతూ గంభీరంగా సాగించాడు ప్రసంగాన్ని రంగారావు.

"మీరు చెపుతున్నది దేన్నిగురించో అంతుపట్టడం లేదు" అంది సుందరి.

భర్త పడుకున్న పడకకుర్చి వార కూర్చుని, తమలపాకులు సర్దుతూ, మధ్య మధ్య వున్న ఎండుటాకులు పక్కగా ఉంచుతూ.

"నేను నీ పాణిగ్రహణ మహోత్సవం జరిపేవరకూ, మన జీవితం శతశరత్తుల బంధంగా అయేవరకూ నేను జీవితంతో జూదం ఆడాను!

అని, చేతిలోని కాఫీకప్పు కింద ఉంచి, సిగరెట్ పీల్చు పీల్చాడు.

"ఆ తరువాత"

అంటూ, అతి విచిత్రంగా తల తిప్పింది సుందరి.

సుందరి తల తిప్పడంలో ఆమె కన్నులుకూడా అతి వయ్యారంగా నడిచాయి. నడిచి, నడిచి వాలుగను లయాయి.

ఆ సమయంలో ఆమె చిటికెన వ్రేలికి తొడిగే తమలపాకు చిలకకూడా ఊగిసలాడింది.

"ఆ తరువాయి పెద్దమ్మాయి పుట్టే వరకూ జీవితం జీవితంగానే సాగింది"

"ఆ తరువాయి...."

అని, పెదవులు మాత్రమే కదిలే నవ్వు నవ్వింది.

"తరువాయి జీవితంలో కొత్త మలుపు వచ్చింది. అది జీవితంలో జూదమూ కాదు, చెలగాటమూ కాదు."

"మరి యిప్పుడో!"

అంది, అతి అభిరామంగా మెడ తిప్పి, కన్నులలో తళుకులు నడిపిస్తూ, చిటికిన వ్రేలికి తొడిగిన తమలపాకు చిలకలో వక్కపొడి, ఏలక్కాయలూ, కుంకుమపువ్వూ, జాజికాయ, జాపత్రి వేసి, అతని నోటి కందిచ్చింది. ఆ సమయంలో ఆమె పెదవులపై కదలియాడే నవ్వు, కన్నులలో నాట్యం చేసింది.

సుందరి నవ్వడం రంగారావు చూడలేదు.

సాధారణంగా ఆమె నవ్వదు.

ఆ ముఖం ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉంటుంది.

నిరంతర దరహాస శోభామయ వదనంలో ప్రత్యేకం ఆ క్షణంలో చిరునవ్వు విసిరిందనికానీ, విరిసిందని కానీ అనడం కష్టం.

అయితే, నవ్వినప్పుడు మాత్రం ఆమె బుగ్గలలో చిన్ని చిన్ని సుడులు తిరుగుతాయి. అంతే! - అదేగుర్తు - సుందరి నవ్వుతున్నది అని తెలియడానికి. ఎందుకింత చెప్పాలీ అంటే,

ఆమె నవ్వుతున్నప్పుడు విచిత్ర ధ్వనులేం రావు.

వికట స్వరాలూ పలకవు.

మరి ఎలా గ్రహించడం?

ఆ వినీల నయనాలు మరింత మెరుస్తాయి.

పెదవులు కొద్ది ఆర్ద్రాలయి కదులుతాయి, పక్కకి.

స్పష్టంగా మనకి కనిపించేయి - ఆమె బుగ్గలలో సుడులు.

మరి యివన్నీ కంటికి కనిపించేవే కాని, చెవికి తగిలేవి కావు. కావు కనకనే ఆమె ముఖంలోకి చూడగలు

అదృష్టవంతులకి కాని - ఆ దరహాసం అందదు.

## 2

"మా అమ్మ నవ్వుతుంటే యెంత బావుంటుందో"

అని పకాలున నవ్వుతుంది, పెద్ద కూతురు కళ్యాణి.

అయితే అది తండ్రి పోలికను పుణికి పుచ్చుకు పుట్టింది.

"మరి నువ్వు కూడా అమ్మలా నవ్వ గలవా?"

అని, బుగ్గ పుణుకుతాడు, రంగారావు.

"నాన్నలా ఉండే అమ్మాయి అమ్మలా ఎలా నవ్వగలదోయ్" అని కిలకిల నవ్వుతూ నాన్న వొడిలో వాలుతుంది.

నాన్న దగ్గర కూర్చుని అక్క నవ్వుతోంది కనక, కోపం వచ్చి అమ్మ వడ్డిమీద వాలి గట్టిగా నవ్వుతాడు దాని తమ్ముడు.

ఆ యిద్దరి నవ్వులూ బృందగానంగా సాగుతూంటే, భార్య ముఖంలోకి చూస్తూ, గుండె నిండుగా సంతోషిస్తాడు రంగారావు.

పెళ్ళయిన నాటినుంచీ కాకపోయినా, పెద్ద పిల్లకు మూడో యేడు వచ్చిన నాటినుంచీ గతించిన వేసవి కాలం సాయం సంధ్యలన్నీ ఆ నవ్వుల లోనే గడిచిపోయాయి. సంధ్యారుణ శోభలా నిత్య నూతనంగానే ఉండేది సుందరి దరహాసం.

చిరుగాలి తరగలు కదులుతూంటే మల్లి పందిరి పులకించి నవ్వేది. ఆ నవ్వుకి ధ్వని ఉండేది- ఆకుల గలగలలు. మల్లి నవ్వితే ఆ గలగల ధ్వని ఉంటుంది. మా సుందరి నవ్వితే ఆ ధ్వనీ ఉండదు- అనుకుంటూ భావాంబర వీధి విహారణంలో ఉన్న రంగారావు ఆనంద మేఘాలలో తేలియాడే వాడు.

నిన్న సాయంత్రం కూడా అలా తేలి, తేలించాడు రంగారావు. కాని- ఈ సాయంసంధ్యలో-

పరమ గంభీరంగా - జీవితం - జూదం - చెలగాటం - అంటూ ఆరంభించాడు.

అయితే - అనుదినం జరిగే "చిరునవ్వుల సంసారం" రూపకంలో ప్రధాన భూమికలు నడపవలసిన కళ్యాణీ, దాని తమ్ముడూ ఆపూట అక్కడ లేరు.

అంచేత ఈ నాటకంలో ఎలా నటించాలో తెలియక తికమక పడవలసిన అవస్థ వాళ్ళకి లేదు.

## 3

"వింటున్నావా"

అన్నాడు, శూన్యంలోకి నదిచే సిగరెట్ పొగను చూస్తూ రంగారావు.

"వింటున్నా"

అంది, చేతిలో ఉన్న లేత తమలపాకు ఈనె తీస్తూ సుతారంగా.

"కాదే - వెర్రిదానా...."

అని, మరింత గాంభీర్యం మేళవించి, సిగరెట్ విసిరి, కుర్చీలోంచి లేచి, మళ్లి పందిరిదాకా నడిచాడు.

కొద్దిగా వణికింది, సుందరి గుండె లోపలి చల్లని పొర.

ఆ చలనంలో ఆమె బుగ్గలలోని సుడులు అదృశ్యమయాయి.

కొనసాగిన ముక్కు చివర ముత్యం నిలిచిన స్వేదబిందువు నేలకు రాలింది.

కనులలో కదిలే కమనీయ వినీల కాంతిలో ఒకవన్నె దిగజారింది. చేతిలో బంగారు కాంతులీనే తమలపాకులు అక్కడే ఉంచి, అతని వెనకాలే నడిచింది—ఆమె. అంతే! ఆ మనస్సు ఆలోచనా మేఘాలను మాత్రం దరి జేర నివ్వలేదు.

సాధారణంగా -

ఆలోచనల సాలీడుని మనస్సులో చేరనివ్వడంకానీ, ఆ తరువాయి సాలి గూడు పోస్తుంటే చూస్తూ ఊరుకుని మనస్సుని హింసించడం కానీ, అయిదారేళ్ళుగా సుందరి ఎరగని విషయం.


నిశ్చింతగా నిద్రనుంచి ప్రభాతానికే లేవడం- గడియారం తొమ్మిది గంటలు కొట్టకపోయినా, ఆకాశవాణి ప్రసార సమాప్తి చెప్పి సెలవు తీసుకోకపోయినా- (విద్యుత్ సరఫరా అంతరాయంవల్ల-) ఇంటిపని, వంట పని పూర్తిచేసి, పిల్లలకూ భర్తకూ ఆరగింపు సాగించడం, వాళ్ళు తృప్తిగా తేన్చి, లేచాక-పిల్లల్ని బడికీ, భర్తని కాలేజీకి పంపి, సింహద్వారం మూసేసి వచ్చి, ఒక్క పది నిమిషాలు విశ్రాంతిగా నడ్డివాల్చి, అప్పుడు భోంచేసి—

ఆ భోజనానికి వెళ్ళబోయేముందు, తన మందిరంలో వున్న సింహవాహనా రూఢయైవున్న రాజరాజేశ్వరికి చేతులు జోడించి, ఒక్క పాట పాడుకుని, భోజనం చేయడం, వంటిల్లు అద్దంలా ఉంచి, వచ్చి మడతమంచం మీద ఒకగంట నడుంవాల్చే యత్నంలో మూడు తమలపాకులు చేత్తో అందుకుని, దానికి అవసరమయిన అనుపాన సామగ్రి తీసుకోవడం .... ఆ తరువాయి క్రొత్త పత్రికో, సరికొత్త నవల వస్తే అదో కాస్సేపు చదివి, వీలు వెంబడి పిల్లగానుమీదనో, తన చీర అంచుకో రంగుదారాలతో లేసు పని సాగించడం....

అలా సాగుతూండగా - పిల్లలిద్దరూ స్కూల్‌నుంచి వస్తారు.

వాళ్ళకు అన్నం పెట్టి మళ్ళీ స్కూల్‌కి పంపి కూర్చునే సరికి, పక్కింటివారి రత్నావళి సంగీతం నేర్చుకోవడానికి వస్తుంది.

పాట నేర్చుకోవడం పావుగంటే - అయినా ఆ పాట నేర్పడానికి ముందు కొంతసేపు సుందరి లలితాభిరామాయణం, నేర్చుకున్నాక రత్నావళి విశేషాల వివరణ కొంతసేపూ సాగేసరికి, పొద్దు వాటారుతుంది.




చిన్ని డ్రాయరుమీది బుల్లి గడి యారంలో పెద్ద ముల్లు అరుదాటి, చిన్నముల్లు నాలుగు దగ్గరకు రాబోతూ ఉంటుంది.

అప్పటికి పక్కవాటాలోని హేమ లతగారింట్లో కుంపటి అంటిస్తున్న శబ్దం వినిపిస్తుంది.

అప్పుడులేచి, నెమ్మదిగా రత్నా వళిని సాగనంపి, కుంపటి అంటించే సరికికానీ, కాఫీ డికాషన్ దిగుతుండగా కానీ పిల్లలిద్దరూ వస్తారు.

ఆ యిద్దరూ, ఆ రోజు స్కూల్లో చేసిన తమాషాలు, అల్లర్లు అన్నీ విని పిస్తారు. వాళ్ళ మేష్టారి కోపాన్ని, పక్కవారి తెలివితక్కువ తనాన్ని వివరిస్తుంటారు.

తన పని తను సాగిస్తూనే, సుందరి నవ్వుతూ-

"అందరినీ అలా ఆడించి అల్లరి చేస్తే, నలుగురూ ఏమనుకుంటారమ్మా, తప్పుకాదూ. రంగారావుగారి పిల్లలు మంచివాళ్ళు, తెలివికలవాళ్ళు అని పించుకోవాలి" అని బుజ్జగిస్తుంది.

"రంగారావుగారి పిల్లల్ని అలా అను కోరు. సుందరమ్మగారి పిల్లలు చాలా మంచివాళ్ళు. శ్రద్ధగా బడికి వస్తారు. మంచిగా చదువుకుంటారు. బుద్ధిగా యింటికివెళ్ళి అమ్మ చెప్పినమాట

వింటారు- అనుకుంటారు. అంతేకాదు తమ్ముడూ...."

అని నవ్వుతుంది, కళ్యాణి.

"అలా అనుకోరులే"

అని,అక్కను వెక్కిరిస్తూ దొడ్లోకి పారిపోతాడు.

వాణ్ణి తరుముతూ కళ్యాణి వెడుతుంది.

వాళ్ళిద్దరూ అలా కాస్సేపు ఆడుకుంటారు.

అప్పటికి రంగారావు వస్తాడు.

ఇంటికిరాగానే భర్త అవసరాలు చూసి, కాఫీ యిచ్చి, వంటపనిలో పడుతుంది.

అంతవరకూ రంగారావు పిల్లలిద్దరినీ కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తూ, వాళ్ళ చదువుల విషయంలో కొంత పరీక్ష చేస్తాడు.

వంట పూర్తికాగానే సుందరికూడా వాళ్ళ దగ్గరకు చేరుతుంది.

అమ్మ రాగానే పిల్లలిద్దరూ ఇంట్లోకి వెళ్ళిపోతారు.

అమ్మా - నాన్న మాట్లాడుకుంటుంటే కల్యాణీ - తమ్ముడూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు.

ఈ కార్యక్రమం పూర్తి అయేసరికి ఎనిమిదిగంటలవుతుంది. సరిగ్గా ఎనిమిదింటికి భోజనాలకు లేస్తారు.

భోజనాలయాక అరగంటసేపు తాంబూలసేవనం సాగుతుంది. ఆ సమయంలో రంగారావు పిల్లలకు కొన్ని విజ్ఞానవిశేషాలు వివరిస్తూంటాడు.

ఎనిమిదిన్నర అవుతూండగా పిల్లలిద్దరూ పుస్తకాలు తీసుకు కూర్చుంటే సుందరి వాళ్ళకి పాఠాలు చెపుతుంది. రంగారావు తన పుస్తకాలుతీసి, కాలేజీలో మరునాటికి అవసరమయిన పాఠంలో విశేషాలు చూసుకుంటాడు.

రేడియో యింగ్లీషు వార్తలు ముగిస్తుంది.

పిల్లల చదువు పూర్తి అవుతుంది.

అప్పుడు సుందరి రేడియో దగ్గర పడక కుర్చీలో పడుకుని తలగడామీద తలఆన్చి దినపత్రిక తిరగేస్తూండగా, రంగారావు పెదదీపం తీసేసి. చిన్న దీపం స్విచ్ వేస్తాడు.

ఈ దినచర్యలో సాధారణంగా మార్పురాదు.

ఒకవేళ మార్పువచ్చినా అది అంతగా విపరీతమయినది కాదు.

అయితే అలా గడియారంలా సాగిపోతున్నా జీవితంయాంత్రికంగా సాగుతున్నట్లు ఒక్కరికీ అనిపించదు.

మనుషులు యంత్రాల్లామా ఉండరు.

ఎప్పటికప్పుడు కొత్తగానే నడుస్తుంది రోజు - ఏటా వచ్చే దీపావళిలా, సంక్రాంతిలా ... నిత్య వసంత శోభ వెల్లివిరుస్తూనే ఉంటుంది. అది ఆ భార్యా భర్తల మధ్య ఉన్న అనురాగంతో, పిల్లలమీది వాత్సల్యంతో కొత్త చివుళ్ళు తొడుగుతూనే ఉంటుంది.

అయితే ఈనాడు మామూలుగా సాగక కొంచెం విచిత్రంగా ఉంది. ఆ చిత్రం రంగారావు మనస్సుకే తెలియడంవల్ల, సుందరి మామూలు చిరునవ్వుతోనే కూర్చుని, పూర్వ నాటకమే ఆడటానికి యత్నిస్తోంది. ఆమె బుగ్గలలో సొట్టలు తమ నిసర్గశోభను పెంచుకుంటూనే ఉన్నాయి.

రంగారావు భారంగా నిట్టూర్చి -

"ఈ ఉద్యోగానికి స్వస్తిచెప్పి మరోచోట పనిచేద్దామనిపిస్తోంది"

అన్నాడు.

"అదే బావుంది. అసలు మనం యిన్నాళ్ళు యీ వూళ్ళో ఉండగలగడం నాకూ ఆశ్చర్యంగానే ఉంది"

అని, కోరచూపు చూసింది.

అయితే రంగారావు దృష్టి సుందరి వైపు లేకపోవడంవల్ల ఆ చూపులోని వాలు, ఆ వాలులోని సొగసు అతనికి గిలిగింతలు పెట్టలేకపోయింది.

"భగవంతుడు - ఎంత తెలివయినవాడే - వాడు ' ' న్నాడే ఎవడు ! ఆ లీలామానుషరూప ప్రియుడు, వాడు నీ బుర్రలో ఆవగింజంతకూడా ఆలోచనాశక్తికి వీలుంచాడు కాదె" అన్నారు. దృష్టిశూన్యంలోనే ఉంచి.

"అది ఉందీ అనుకునేవాళ్ళు పడే అవస్థలు చూస్తూన్నాకకూడా ఆ నరకంలో నేనూ పడనా ! ఆలోచించి, అవసరానవసరాలుచూసి పెడుతూ, అనురాగబంధంలో హాయిగా నడిపే భర్త దొరికినదానికి....

అని, సగర్వంగా నవ్వింది.

నవ్వుతున్నప్పుడు ఆమె బుజాలే కాదు, సర్వాంగాలు పొంగాయి.

అయితే ఈసారి సుందరి నిశ్శబ్దంగా నవ్వింది.

చెవికి వినపడేలా నవ్వింది,

ఆ నవ్వు చెవికి సోకడంతో ఉలిక్కిపడి చూశాడు, రంగారావు.

కిల కిల ధ్వనితో సుందరి నవ్వడం వారి దాంపత్య జీవితంలో యిది అయిదోసారి, తప్పితే ఆరు.... అంతే !

"అయితే నీ అంతట నువ్వు ఆలోచించి నాకు సలహా యివ్వడం ఉండదంటావ్. అంతేనా !"

"మీరు మరీ విచిత్రం...."

అని మరోమారు నవ్వి -

"మీ కంటె మంచి-చెడ్డలు తెలిసినదాన్నయితే మీ పెళ్ళాంగా ఉండడం దేనికీ ?.... మిమ్మల్నే నా...."

అంటూ, ముద్దబంతిలా పొంగిన బుగ్గ అతనిచేతిమీద ఆన్చి -

"మీరు మాకు కష్టం కలిగించే పనేదీ చెయ్యనప్పుడు మేం ఆలోచించి కష్టాలు తెచ్చుకోవడం...."

అని మళ్ళీ నవ్వింది.

"ఎంత హాయిగా జీవించే తత్వం వంట బట్టిందే కన్నారీ"

అని, ఆమె భుజంమీద చెయ్యివేసి, దగ్గరగా తీసుకుని -

"నువ్వు వండిపెడితే మేం ఎంత హాయిగా తింటామో, నేను ఆలోచించి పనిచేస్తే మీరంతా అంత సుఖంగా ఉంటారు"

అని, నవ్వాడు.

"ఇంతకీ ఏ ఊరు వెడతాం"

"హమ్మయ్య. ఒక్క ప్రశ్న అడగగలిగావ్, యిన్నాళ్ళకి"

"అడగవలసిన అవసరం కలిగితే కదా!"

"శోభనంనాటి మొదటిరాత్రి ఎలా ఉన్నావో యిప్పుడూ...."

అంటూ, తృప్తిగా ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటి మరీ చిన్నతనం....పిల్లలు వస్తారు"

"అందుకే చిన్నతనం. పిల్లలు లేకపోతే ముసలితనం వచ్చేది"

"ఇంతకూ అసలు విషయం చెప్పలేదు"

అంది, రంగారావు కన్నులలో కన్నులుంచి -

"ఏముంది మళ్ళీ ఉద్యోగంనుంచి తీసేశారు, కమిటీసెక్రటరీగారి మేనల్లుడికి అవసరం వచ్చి...."

అని నిట్టూర్చి, ఆమెవైపు చూశాడు.

"అంతేనా, చదువుకున్నవారికి బాధదేనికి. ఎక్కడికి పోయినా సంపాదించుకోగలం - ఈ మాత్రం ఉద్యోగం"

అని నవ్వుతూంటే, రంగారావు గుండె పొంగిపోయింది.